# తప్తహృదయం

రచన :
ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

రవిని క్రిందటి వేసవికాలం శలవలకే వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించాడు మధు. అయితే సంక్రాంతి శలవలదాక వెళ్ళటానికి వీలుపడిందికాదు.

పదేళ్ళమధ్య మధును చూడటమే పడలేదు. అప్పుడప్పుడు ఉత్తరాల ద్వారా మాత్రం వకళ్ళవిషయం వకళ్ళు తెలుసుకుంటూవుంటున్నారు. ఆనాడు స్టేషనుకు మధు వచ్చాడు. బండీలో యింటికి వెళుతున్నారే కాని రవి మనస్సు యేదో ఆలోచిస్తూనే వున్నది. మధు అంతా క్రొత్తక్రొత్తగా కనిపిస్తున్నాడు. ఇంటికి వెళ్ళినతర్వాత కానీ మధు తల్లి పోయినట్లు మధు పింతల్లే మధు మంచీ చెడ్డా చూస్తున్నట్లు తెలియలేదు. మధు తండ్రి ఆ గదిలో ఒక పడకకుర్చీలో పడుకునివున్నాడు. రవినిచూసిగాబోలు అతి ప్రయాసతో లేవబోతుంటే రవికి ఏమనాలో తోచక గభాలున కుర్చీదగ్గరకు వెళ్ళాడు. ఆయన చూపుల్లోని ఆప్యాయత రవిని ముగ్ధున్ని చేసింది. మధు పింతల్లి కూడా రవిని యెంతో ఆప్యాయతతో స్వీకరించింది. వాళ్ళిద్దరు యేవేవో చెపుతూపోతుంటే మధు, రవి చెవులు అప్పచెప్పి వింటూకూర్చున్నారు. ఏదైనా మధు కల్పించుకుంటాడేమోనని రెండుమూడుసార్లు మధువంక చూశాడు రవి. కానీ లాభంలేకపోయింది. నిజానికి మధు కూడా అసంతృప్తిగానే వున్నాడు. భోజనాలు అయినతర్వాత సావిట్లోకివచ్చి కూర్చున్నారో లేదో, ఒక అమ్మాయి మేడమీదనుంచి గబగబదిగి వాళ్ళిద్దరుకూర్చున్నచోటికి వచ్చింది. రవి వంక యేదో ఆశ్చర్యంగా చూసిందికూడ. రవికూడ యెవరో అపరిచితురాలువంక చూసినట్లుగానే ఒక్క క్షణం పాటు చూశాడు.

'మా చెల్లెలు సుజాత' అన్నాడు మధు అదోవిధంగా.

ఆమెదైన్యపుచూపులు రవి, హృదయాన్ని కదిలించేసినాయి.

మధు పినతల్లి తల వంచుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయికూడా రవి వంక బెదురుచూపులతో చూస్తూ గదిలోకి వెళ్ళిపోయింది. మధు నిస్తబ్ధుడయిపోయాడు ఒక్కక్షణంపాటు.

సుజాతలో రోజురోజుకు వస్తున్నమార్పు రవికి బాగా తెలుస్తున్నట్లుంది. కారణం తెలుసుకోలేకపోయినా ఆమె మార్పు రవికి భయాన్ని కలుగచేస్తోంది.

మేడపైన గదిలోకివెళ్ళాడు రవి మధు కోసం. మధు లేడు, సుజాత వుంది. సుజాత రవిని చూసేలోపలనే రవి వెళ్ళిపోదామని ప్రయత్నించాడు. కానీ సుజాత దృష్టిలో రవి పడకుండా వుండలేకపోయాడు. అప్పుడే మధుకూడ మెట్లమీదనుంచి పైకివస్తున్నాడు. రవి గబగబ క్రిందకుదిగుతూ, నీకోసమై పైకి పోయాను అన్నాడు మధుతో కొంచెంగా తడబడుతూ. మా చెల్లెలు పైనవుందా అనే అమాయకపు ప్రశ్నకు నిజానికి రవి కూడా చాలా అమాయకంగానే జవాబు చెప్పాడు వుందని. కాని తర్వాత పశ్చాత్తాపపడ్డాడు తాను అట్లా చెప్పకూడదేమోనని. మధు చాల సంస్కారహృదయం కలవాడు. నన్ను అపార్థం చేసుకుంటాడని నేను యెన్నడు అనుకోను అని అనుకుంటూ రవి తృప్తిపడ్డాడు.

ఆనాటి సాయంత్రం చీకటి పడుతూవుండగా రవి యింటికి చేరుకున్నాడు. అప్పుడే గుమ్మంలో కూర్చుని సుజాత లాంతరు వెలిగిస్తోంది. సుజాత పినతల్లి యేదేదో విసుగ్గా అనుకుంటోంది. సుజాత కొంచెంగా తలెత్తి లాంతరు అక్కడ పెట్టేసి మెల్లిగా గదిలోకి వెళ్ళిపోయింది. రవి వాకిట్లో బల్లమీదకూర్చున్నాడు. కొంతసేపటికి మధువచ్చి రవినిచూసి ఆశ్చర్యపోయాడు. మధుకు యింట్లోవాళ్ళ మీద చెడ్డకోపం వచ్చింది. ఆ కోపంలో తన తండ్రిని గురించి, తన పినతల్లిని గురించి యేవేవో నేరాలుచెప్పటం మొదలుపెట్టాడు.

'నేను చూడలేదునాయనా లేకపోతే రమ్మనేదాన్నే' అన్నది మధు పినతల్లి.

'వచ్చి చాలాసేపయింది' అన్నది సుజాత మెల్లిగా పింతల్లితో.

రవి తలెత్తి ఇప్పుడేలెండి వచ్చిందన్నాడు మధువంక చూస్తూ. మధు రవిని అడగలేదు.

ఆనాటిరాత్రి రవికి సరిగ్గా నిద్రపట్టలేదు. మధు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. ప్రక్కగదిలో దీపం వెలుగుతూనేవుంది. అలవాటు చొప్పున పైన వరండాలోకి వెళ్ళాడు రవి. అతని వెనకాల యెవరో మనిషి వస్తున్నట్లు అలజడి అయింది. తీరా వెనక్కి తిరిగిచూస్తే యెవరూలేరు. మళ్ళీ తన ప్రక్కమీదికి వెళ్ళిపోయాడు రవి. హఠాత్తుగా తలెత్తేటప్పటికి తలుపుచాటున సుజాత వున్నట్లు రవి చూడకలిగాడు. అమితమయిన ఆశ్చర్యంతో రవి ఆలోచనలు వివిధమైన దారుల్లోకి పోతున్నాయి. అంత సాహసంగా ఆసమయంలో సుజాత అక్కడకు వస్తుందని అనుకోవటం రవి వూహకు అందని విషయం. రవి కేమీ తోచటంలేదు. రవిని ఏదో గట్టిగా అనబోయే లోపలనే సుజాత యేదో అడుగుతున్నట్లు పెదిమలుకదిలిస్తూ కొంచెం ముందుకువచ్చింది. రవి యేవిధంగానూకూడా ఆమెతో సంభాషణల్లోకి దిగాలని అనుకోలేదు. కాని సుజాత దానికి అనుగుణంగా ప్రవర్తించటంలేదు. సుజాత వేస్తున్నప్రశ్నలు రవికి చాలా ఆశ్చర్యాన్ని కలుగచేస్తున్నాయి. తప్పనిసరిగా కొన్నింటికైనా సమాధానంచెప్పాలిసివచ్చింది. కానీ రానురాను సుజాత మాటలు ఆమె హృదయాన్ని రవికి అతిసన్నిహితం చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. రవికి అప్రదిష్టపడటం యిష్టంలేదు.

నిశ్చలంగా రవి ముఖంలోకిచూస్తూ నిలబడ్డ సుజాత కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూ, 'సుజాత నాకు పెళ్ళయింది' అన్నాడు రవి హుందాగా.

'నాకూ పెళ్ళయింది. అన్నది సుజాత అతిహీనంగా పమిటకొంగుతో కనురెప్పలు తుడుచుకుంటూ,